# బాపూ బొమ్మ - 10

రత్తాలు వెళ్ళిపోయింది కాబట్టి ఆ పనులన్నీ నాకు కేటాయించబడ్డాయి! అది నాకేం కష్టంగా అనిపించలేదు.

“ నేను చెబుతుంటాను, నేర్చుకుని చేస్తూండు... చేయగా చేయగా అదే అలవాటవుతుందిలే...! “ అంటే తల వూపాను. ఆ మాటలకు అర్థం ఏ వంట ఎలా చేయాలో చెబితే విని అలాగే చేయాలని కాబోలు అనుకున్నా...కానీ అదేం లేదు. ‘ ఫలానా కూర చేయి...ఈ పని చేయి...’ అని పురమాయించటమే ! దానిలో నేను నేర్చుకుని చేసేదేం ఉంటుందీ...నాకు చేతనైనట్లు చేయటమే గానీ...!

నేను చేసిన వంటల్లో, పనుల్లో వీలైనన్ని తప్పుల్ని వెతికి...ఎత్తిపొడుపుగా మాట్లాడి సంతృప్తి పడటం అత్తగారి నైజమని నాకు తెలుసు. అందుకని బాధ పడకుండా విని వూరుకోవటం నాకూ అలవాటే !

అయితే ఇంటి వాతావరణంలో ఏదో కొత్త మార్పు చోటు చేసుకుంటున్నట్లు నా మనసు పసిగట్టగలిగింది!

ఎప్పుడూ నా పనుల్లో వంకలు వెతకటానికి ఉత్సాహం చూపించే అత్త అదేమిటో కొత్తగా మాట్లాడటం నిజంగా వింతే !

“ ఏమిటోనే...పనులన్నీ నీకే చుట్టుకున్నాయి! ఊరికి వెళ్ళినపుడు బండి కుదుపులకి పట్టేసిన నడుంతో నీకేం సాయం చేయలేకపోతున్నానూ....” అని నిట్టూరుస్తుంటే..మా అత్తగారి వైఖరిలో మార్పు వచ్చేసింది కాబోలనే ఆనందం ఏమీ కలగలేదు. ఆ మాటల వెనక అంతరార్థం ఏమైనా ఉందా అనే ఆలోచనతో సతమతమయ్యా.

అత్తగారి ధోరణే కొత్తగా ఉందనుకుంటుంటే, ఆయనగారు ఎక్కువగా ఇంటిపట్టునే ఉండటం మరో విచిత్రం! ఆ విషయం నాకేం ఆనందం కలిగించలేదు. పైగా బయట కాలక్షేపం చేస్తుంటేనే నా ప్రాణానికి హాయిగా ఉంటుంది కదా అనుకున్నాను. నా వేపు చూస్తూ అప్పుడప్పుడూ ఆయనగారు చిన్నగా చిరునవ్వు చిందించే ప్రయత్నాన్ని చూస్తుంటే.. తనువు పులకరించలేదు! జలదరించింది..! ఏం జరగబోతోంది దేముడా అనే భయం కూడా కలిగింది!

అనురక్తి అనేది లేశమాత్రం కూడా లేకుండా అంతరించి మనసంతా విరక్తి మాత్రమే నిండిన నా మనసుపై ఆయనగారి ఆకర్షణ మంత్రం ఏమాత్రం పనిచేయదని నెమ్మదిగా తెలుసుకుంటాడులే అనుకున్నా.

వాళ్ళ మార్పుకి కారణం ఏమై ఉంటుందని నా ఆలోచనకి పదును పెట్టగా.. ఓ కారణం స్ఫురించింది. నిజమో, నా ఊహో అనేది మాత్రం పూర్తిగా తెలియదు! వీళ్ళు ఊరెళ్ళినపుడు... చావు బతుకుల్లో ఉన్న బంధువులావిడ ఈయనగారికి పిల్లలింకా పుట్టలేదనే కారణంతో ఆస్తిలో వాటా ఇవ్వలేదా..? అత్తగారి మాటల్లో వినిపించిన ‘వంశాకురం’ అనే మాట నా ఆలోచనకు కారణం అయింది! అందుకే ఆ నాగసుందరినే పట్టుకు వేళ్ళాడటం కాకుండా నా వేపు దృష్టి పెట్టమని అత్తగారు సలహా ఇచ్చి వుంటుందా..?

నాగసుందరి గురించి మా అత్తగారు హెచ్చరిస్తే.. ఈయనగారు తన మీద ప్రేమతోనే సంబంధాలన్నీ తిరగగొడుతుందని గర్వంగా చెప్పుకోవటం, అత్తగారు అసలు కారణం వాళ్ళే వెనక్కిపోతున్నారంటూ

వెక్కిరింతలా దెప్పటం.. గుర్తుకొచ్చింది. అందుకే.. ఆయనగారు అలా.. ఛ.. ఛ..! చాలా జుగుప్సగా అనిపించింది! ఒకప్పుడు నన్ను 'వగరు పిందె' అన్నారు. దూరం పెట్టారు. ఫరవాలేదు! కానీ... ఇపుడు.. ఈ నటనకి వెగటు కలుగుతోంది! స్పందించే మనసు ఉన్న మనిషిగా, జీవిత భాగస్వామిగా గౌరవం లేకుండా తినే వస్తువుతో పోల్చి.. నాగసుందరి గురించి నేను వింటున్నాననే లక్ష్యం లేకుండా నిర్లజ్జగా మాట్లాడుకోవటం అవమానంగా అనిపించినా భరించాను!

అవును.. అపుడు మరొకరితో పోల్చటాన్ని భరించలేకపోయాను! అలాగే ఇపుడు నన్ను ఆకట్టుకోవాలనే ప్రయత్నాన్ని కూడా..!

నాకపుడు మా తెలుగు మాష్టారు చెప్పిన ఒక శ్లోకానికి అర్థం అప్రయత్నంగా జ్ఞాపకం వచ్చింది.

బంగారానికి.. తనను అరగదీసినా.. కరగదీసినా ఫరవాలేదుగానీ, గురువింద గింజతోనో, వరిగింజతోనే తూకం వేస్తున్నపుడు మాత్రం బాధపడుతుందట!

నేను బంగారాన్ని కాకపోయినా, వివాహబంధంతో జీవితాన్ని పంచుకోవటానికి వచ్చిన భార్యననే ఇంగితం, గౌరవం రవ్వంత కూడా లేకుండా.. మరెవరితోనో పోల్చి దోర, దోమ కాదంటూ అవమానకరంగా మాట్లాడిన మనిషి.. ఇపుడు ఇదేమిటీ ఇలా కొత్తగా..ఛీ...ఛీ....!

భర్తని కొంగున ముడేసుకునే వగలూ వయ్యారాలూ తెలియని మొద్దు ముఖాన్నంటూ ఎద్దేవా చేసిన అత్తగారూ అవతారం మార్చి ఆదరం ఒలకబోస్తుంటే ఏదో మర్మం ఉండే ఉంటుందనిపించదా..?

మురికి కాలువలో కొన్ని అత్తరు చుక్కలు చల్లినంత మాత్రాన దాని దుర్గంధం తొలగిపోతుందా.. స్వచ్ఛమైపోతుందా..! ఏదో వికారమే ఇబ్బంది పెడుతోంది. నిర్లక్ష్యాన్ని భరించగలిగానుగానీ... నటనను సహించలేకపోతున్నానన్నమాట!

★ ★ ★

ఆ రోజు పనులన్నీ ముగించి లోపలకు వెళ్ళబోతున్న నన్ను చూసి అత్తగారు ''ఇక్కడికి గాలి బాగా వస్తోంది. కాసేపు కూర్చోవే.. బాగా చెమటలు పట్టేసినట్లున్నాయి..!'' అని చిరునవ్వుతో ఆదరంగా చెప్పింది.

చెంగుతో నుదుటి చెమటను తుడుచుకుంటూ ఎదుటి కుర్చీలో కూర్చున్నాను. ఒక క్షణం తర్వాత అదే చిరునవ్వుతో ''అవునూ.. మీ నాన్నని ఒక ఎకరం అమ్మి.. అల్లుడికి కారు ఇమ్మని అడిగితే బావుంటుంది కదూ..?'' అంది.

''కారు... దేనికీ..?'' అయోమయంగా చూశాను.

అణచిపెట్టుకున్న అసహనం పైకి ఉబికి వచ్చింది. ''ఎందుకేమిటీ.. నువ్వు.. ఊరేగటానికి..!'' గట్టిగా అని మళ్ళీ వెంటనే సర్దుకుని చిరునవ్వును తెలివిగా వెనక్కు రప్పించేసింది.

జారిపోయిన ముసుగును సవరించుకోవటంలా అన్నమాట!

''కూతురు, అల్లుడూ దర్జాగా కారులో తిరగటం మీ నాన్నకీ ఆనందమేగా..!''

''అయితే.. కారుకొని ఇమ్మని.. అపుడు మనింటికి వచ్చిందే.. ఆ అమ్మాయి పేరేమిటీ ఆ.. నాగసుందరి..

వాళ్ళ నాన్నను అడిగితే బావుంటుంది కదా..!'' నెమ్మదిగానే అన్నా.

అత్తగారి మొహం కందగెడ్డలా కందిపోయింది.. కోపంతో..!

''వాళ్ళ నాన్నకేం పనీ, కారు కొనివ్వటానికీ..?'' గట్టిగా ఉరిమినట్లే వచ్చాయి మాటలు.

''ఎందుకేమిటీ.. జంటగా ఊరేగుతుందనీ.. కూతురు!'' వ్యంగ్యం, నిర్లక్ష్యం అనుకోకుండానే నా మాటల్లోకి వచ్చేసాయి!

అపుడెపుడో.. మా ఊరు నుండి వచ్చినతనికి.. పండుగకి మేమిద్దరం ఏదో టూరు ప్రోగ్రాం పెట్టుకున్నామని అత్తగారు చెప్పింది! నిజంగానే ఆయనగారు టూరుకి ప్రోగ్రాం పెట్టుకున్నారు.. వెళ్ళొచ్చారు.. నాగసుందరితో!

ఆ సమయంలో అది గుర్తుకు వచ్చి.. అలా మాట్లాడేసి వుంటాను!

మా అత్తగారు కంచుకంఠాన్ని మోగించింది. '' మావాడు కట్టుకున్నది నిన్నయితే దాని బాబుకేం పనీ.. కొనివ్వటానికీ..?''

ఎటువంటి లా పాయింటో..!

'' మా నాన్నకి పెళ్ళితంతుకైనా ఎంతో కొంత ఖర్చయిందిగానీ, వాళ్ళ నాన్నకి అదీ లేదుగా అందుకనీ..'' నసుగుతూ ఆపేసాను.

''అబ్బో.. మా గొప్పగా ఖర్చుపెట్టార్లే మీ వాళ్ళు.. కానీ కట్నం లేకుండా...'' నా సహనానికి గండి పడింది!

ఇప్పటికి 'కానీ కట్నం' అనే మాట ఎన్నిసార్లు విని వున్నానో..! అందుకే... ఏమన్నానో తెలియదుగానీ.. గది గోడలు దద్దరిల్లేంతగా మాత్రం కేక పెట్టాను! ఆ అరుపుకి మా అత్తగారు కళ్ళు తేలేసి చూస్తున్నట్లు బిగుసుకుపోయింది! ''కట్నం.. ఆ ప్రసక్తి లేనే లేదని చెప్పింది మీరే.. అయినా ఆ మాట అలా ఉంచినా, కట్నం ఎందుకు ఇవ్వాలీ..? ''

షాక్ నుండి తేరుకున్న అత్తగారు ''అది రివాజు కదా.. లేకపోతే నీకు తేరగా తిండి పెట్టాలా..?'' అంది.

''ఏం.. నేను వండి పెట్టటం లే..?''

''అబ్బో.. నువ్వులేకపోతే.. మాకెవరూ వండివార్చే వాళ్ళు దొరకరు మరీ..!''

''అవును.. మా నాన్న నాకు తిండి పెట్టలేకనే, ఇక్కడికి పంపించాడు కాబోలు!'' నాకేమయిందో గానీ మాటకు మాట తూటాలా పేల్చేశాను! నాన్న ప్రసక్తి వచ్చినందుకే నాకంత పిచ్చి కోపం వచ్చేసిందేమో !

''అమ్మో... హమ్మో..! ఖాళీ చేతులతోనే వచ్చి ఇం..త బడాయి వెలగబెడ్తోంది! ఎంతో కొంత తెచ్చివుంటే... ఇంకెంత రెచ్చిపోయేదో..! గొప్పింటి కోడల్ననే ఇంగితం ఇంతయినా లేకుండా ఎలా రంకెలు పెడుతుందో..!''

స్వగతం అయినా వినిపించేట్లుగా పెద్దగానే అంది అత్తగారు.

'కట్నం.. కట్నం..!' అదే పాట! నా మనసులోని మంటను మరింత ఎగదోసింది! ఆమెకు కావాల్సిందీ

అదేనేమో..!

'గొప్పింటి కోడలు..!' నన్ను చిర్రెత్తించే మరో చెత్తమాట!

అందుకేనేమో నాలో అణచిపెట్టుకున్న ఆవేశమంతా ఎగదన్నుకుని బయటకు వచ్చేసింది!

''గొప్పింటి కోడల్ని! ఐశ్వర్యంతో తులతూగుతున్న ఈ ఇంటి వైభోగం ఏమిటో నాకేం తెలియటం లేదు! ఏముందిక్కడ..? ఒకటే చీకటి! రాత్రి మాత్రమే కాదు, పగలూ వెలుతురు రాదు! బయట ఏం జరుగుతుందో తెలిపే పేపరు రాదు! పాటలూ, పద్యాలూ లాంటివి వినిపించే రేడియో మోగకూడదు! నలుగురు బంధువులూ రాకూడదు! అసలు ఎవరికీ కూడా వెలేసినట్లనిపించే ఈ ఇంటికి రావాలనే ఇష్టమే ఉండదనుకుంటా! ఇంకేమిటో ఈ ఇంటి గొప్ప..!

గాలి చొరబడని భోషాణంలో ఊపిరాడనట్లు పడి ఉండటమే.. తెలియక చేసిన ఏ పాపానికో శిక్ష అనుభవించటం! ఈ శిక్షను డబ్బుతో మరీ కొనుక్కోవాలా..?''

''ఇది నీకు భోషాణంలా కనుపిస్తోందా..? ఏం బాగానే తిని తిరుగుతున్నావుగా..?మంచం పట్టలేదుగా..? విశాలమైన భవంతిలో పెరిగి వచ్చిన దానిలా నీలుగుతున్నావే..?'' ముందు నా మాటలకు దిక్కుతోచనట్లుగా బిత్తరపోయిన అత్తగారు రెండు క్షణాలకే తేరుకుని కొరడా ఝుళిపించింది.

అదేమిటో.. నేనూ మౌనంగా ఉండలేనిదానిలా సమాధానం చెప్పేశాను! కాదు.. నా ప్రయత్నం లేకుండా బాణాల్లా దూసుకు వచ్చేస్తున్నాయి మాటలు!

''అవును.. బాగానే తిరుగుతున్నాను! ఈ తిండి తిని మాత్రం కాదు.. మా ఊళ్ళో.. ఇరుకు ఇంటిలో అయితేనేం, ఆనందంగా పెరిగిన ఆ రోజుల జ్ఞాపకాలే నాకు ఊపిరిపోస్తున్నాయి!''

అప్పుడే గదిలో నుండి వచ్చిన కొడుకుని చూసి అత్తగారు రమ్మని పిలిచింది.

''కోడలు పిల్లని మాగమొద్దనుకుంటున్నాంగానీ... అమ్మో...చిత్రాంగే! ఆ మధ్య రత్తాలుని అడ్డం పెట్టుకునీ, ఇప్పుడేమో ఏవంకా లేకుండానే నన్ను పట్టుకునీ ఎన్ని మాటలు దూసిపోసేసిందో! ఈ చుట్టుప్రక్కల ఊళ్ళల్లోనే.. ఇంత పెద్ద లోగిలి ఎవరికీ లేదా.. దీనికేమో భోషాణంలా ఉందట! మనింటికి రావటానికి ఎవరికీ ఇష్టం ఉండదట ! ఒకటా, రెండా.... ఎన్ని నిందలూ, నిష్టూరాలో! పెనం మీద గింజలా పెట్రేగిపోతోంది..!''

ఆయనగారు అమ్మ మాటల్ని ఆసాంతం విని.. అర్థం చేసుకోవటానికి ఓ రెండుక్షణాల సమయం తీసుకుని.. ఆ తర్వాత బొమ్మలా నిలబడిన నావేపు విచిత్రంగా చూసి ''ఇంట్లో ఉన్న ఇద్దరితోనే మాటామంతి చేతకాక బిత్తర చూపులు చూస్తుంటుంది. ఇంకా నలుగురు కావాలా... ఏం సొద వెళ్ళబోసుకోవటానికటా..?'' నిర్లక్ష్యంగా అని బయటకు వెళ్ళిపోయాడు.

స్నేహబృందం నుండి ఏదో కబురు అందిందేమో! అవును.. ఇంట్లో ఉండి నన్ను మచ్చిక చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టినా, నా సహకారం లేక ఫలించలేదు! అందుకే ఇక తన రోజువారీ కార్యక్రమాల్ని యధావిధిగా కొనసాగించటమే మంచిదనుకుని ఉంటాడు !

నాలో కొంచెం ఆలోచన మొదలైంది!

అనవసరంగా ..పెద్దావిడను ఎదిరించినట్లుగా ఎందుకు మాటలు మీరటం.. ఊరుకున్నంత ఉత్తమం లేదనుకుంటే సరిపోయేదిగా!

ఆవేశంతో అనర్థమేగానీ లాభం ఏమీ ఉండదు!

మా ఇంటిని, మా పద్ధతుల్నీ విమర్శించడం ఆవిడకు సంతృప్తి, సరదా అని తెలుసుకున్న దానిని.. ఎందుకిలా చెలరేగిపోయాను? ఎవరి ఇష్టాలు, వాదాలు వాళ్ళవి ! మాటలతో ఎదుటివాళ్ళను నమ్మించాలనుకోవటం వృథా ప్రయాసే!

కొన్ని సంవత్సరాలుగా అక్కడే పుట్టి పెరిగాను కాబట్టి మా ఊరు, మా ఇల్లు, మా వాళ్ళు అనే మమకారం నాకు సహజం! అలాగే వీళ్ళకీ అనుకోకుండా, ఎందుకు అనవసరంగా వాదన పెట్టుకున్నానూ...!

అత్తగారి ఎదుట నిదానంగా కూర్చున్న దానిని.. తర్వాత ఆవేశంతో వూగిపోతూ లేచి కుర్చీని పట్టుకుని నిలబడ్డాను! నాలో నేనే అలా విమర్శించుకుని కొంచెం శాంతించాను.

నిస్సహాయంగా నిలబడినట్లున్న నన్ను చూడగానే, మాటలతో నన్ను గెలిచానన్న ఆనందం కలిగిందో ఏమో... మళ్లీ ధాటీగా మొదలుపెట్టింది అత్తగారు!

'' అసలు నిన్ను కాదే... నీ అమ్మా బాబుల్ని అనాలి! కాపురానికి పంపించేటప్పుడు అత్తవారింట్లో ఎలా మసలుకోవాలో కూతురుకి నేర్పించని వాళ్ళదీ తప్పు!''

నాకు మళ్ళీ.. అమ్మా నాన్నల ప్రస్తావన వచ్చేసరికి ఏదో పూనకం వచ్చేసినట్లయింది!

ఎలాగో నిగ్రహించుకుని నెమ్మదిగానే జవాబు చెప్పా.

''మీరన్నది నిజమే! మా వాళ్లదే తప్పు! ఇంకా చాలా తప్పులు చేశారు! అవన్నీ ఇప్పుడిప్పుడే నాకు తెలిసి వస్తున్నాయి! అందుకే నాకూ వాళ్ళమీద కోపంగా ఉంది!''

మతిపోయినట్లు అయోమయంగా ఆవిడ నావేపు చూసింది!

మళ్ళీ నిదానంగా చెప్పాను'' వాళ్ళమ్మాయికి ఎప్పుడు పెళ్ళి చేయాలో తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయించుకోవాలి గానీ.... ఏదో సంబంధం వస్తే 'ఎప్పటికైనా తప్పదు... చేయాల్సిందేగా' అనుకుంటూ తొందరపడిపోవటం తప్పే కదండీ? తగిన వయసు, సమయం వచ్చేవరకూ ఆగాలని తెలుసుకోకపోవటం తప్పకుండా తప్పే!

పెళ్ళి చేసేటప్పుడు అటు ఇటూ ఏడుతరాల గురించి తెలుసుకోవాలని మన పెద్దలు చెప్పారుగానీ.. అంత తెలుసుకోవటం వీలుకాకపోయినా కనీసం కుటుంబం గురించి అయినా తెలుసుకోకపోవటం ఏమిటి? ఈ విషయంలో మీ తప్పు మాత్రం లేదు! ఒక్కతే పిల్ల కాబట్టి కొద్దో గొప్పో.. ఆ ఉన్నది ఎలాగూ పిల్లకే దక్కుతుంది కాబట్టి అనవసరంగా కట్నకానుకల ప్రసక్తి ఎందుకు తేవటం అని తెలుసుకున్నారు! పిల్ల అమాయకురాలు, 'కానీ కట్నం లేకుండా....' అంటూ సరదాకొద్ది సూదులుతో గుచ్చినట్లు మాట్లాడినా పడివుంటుందే తప్ప నోరెత్తదూ... లాంటి వివరాలనూ సేకరించే మా దగ్గరికి వచ్చారు! అన్నీ తెలుసుకునే వచ్చామని మీరే చెప్పారుగా! అప్పుడు... మీరు వెంటనే ముహూర్తం నిర్ణయించేస్తుంటే, మాకూ వివరం

తెలుసుకోవటానికి కొంత సమయం కావాలని మా వాళ్లు అడగకపోవటం కూడా తప్పే!

నడవడికీ, నడకకీ తేడా ఉందని తెలుసుకోవటంలో మా వాళ్ళు పూర్తిగా తడబడ్డారు! అబ్బాయి ఠీవిగా నడవటం చూశారే తప్ప అతని నడవడిక గురించి తెలుసుకుందామని అనుకోకపోవటం వాళ్లు చేసిన పెద్ద తప్పు! ఆ తప్పుకి నేను శిక్ష అనుభవిస్తున్నాననే విషయమూ వాళ్ళకి తెలియదు! ఆ విషయం తెలుసుకోకుండా వాళ్ళు ఆనందంగా ఉండాలనే నేనూ కోరుకుంటున్నాను. అంటే.. మాలాంటి కుటుంబాలు ఏ విషయాన్నైనా యాగీ చేయకుండా పరువు, మర్యాద అంటూ లోలోన మాత్రమే కుములిపోతుంటారని మీరు బాగానే అంచనా వేయగలిగారు!

పెళ్ళికి కట్నం అనేదే ముఖ్యమైనదన్నట్లుగా, ఆ ప్రసక్తి లేదనగానే ఆనందంగా అంగీకరించటం మావాళ్ళు చేసిన ఇంకొక తప్పు. ఆస్తిపాస్తులలో పెద్దవాళ్లైనంత మాత్రాన సరిపోతుందా ... సంస్కారంలో సమానస్థాయి ఉందో లేదో తెలుసుకోకపోవటం ఎంత తప్పు!

పెళ్ళి అంటే.. ఒకరికొకరు తోడూ నీడగా నిలబడి... కష్టసుఖాల్ని పంచుకుంటూ ప్రేమానురాగాల్ని ఇచ్చిపుచ్చుకోవటమనే అభిప్రాయాన్ని మా వాళ్ళు కలిగించారేగానీ... ఆయనగారు దూరంపెట్టినా, అత్తగారు సుతిమెత్తగా సూటీపోటీ మాటలతో ఆరడి పెట్టినా, ఎలా తట్టుకోవాలో అస్సలు చెప్పలేదు! 'పుట్టింట్లో మాదిరిగా ఆదరాభిమానాలు అందరికీ దొరకవు.. అవమానాల్ని, ఈసడింపుల్ని కూడా ఎదుర్కొవలసి రావచ్చునూ..' అని ఇలాంటి పరిస్థితినీ వివరించి... సహనంతో ఎలా నిలదొక్కుకోవాలో కూడా నేర్పించలేదండీ! ఇదీ తప్పే కదా!

అన్నీ వాళ్ళవే కాదు. నా తప్పూ ఉందనుకోండి! నాకు ప్రయాణాలంటే కొంచెం పిచ్చి ఉంది! కొత్త వ్యక్తులతో పరిచయం, కొత్త ప్రదేశాలు చూడటం ఎంతో బావుంటుందనుకుంటాను. పెళ్ళి అంటే కూడా పుట్టింటినుండి అత్తారింటికి ఓ సరదా ప్రయాణం అని భ్రమపడ్డా..! అందుకే.. అత్తగారింటి నుండే కాలేజికి వెళ్ళి చదువుకోవచ్చంటే, అపుడే పెళ్ళివద్దంటూ గట్టిగా పట్టుపట్టకుండా ఆనందంగా అంగీకరించేశా! నా కంటే చిన్నదైన రత్తాలు కూతురుకు ఈ విషయంలో ఉన్న తెలివి తేటలు కూడా నాకు లేకపోయాయి!

పెళ్ళి పేరుతో నా చదువుమీద అధికారాన్ని ఇంకొకరికి అప్పగించటం ఎందుకూ....ఆ తర్వాత కాదంటే బాధపడటం ఎందుకూ....! ఈ తప్పు వలనే మీ ముందు ఇలా తలదించుకుని నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది!

పెళ్ళి కాగానే మా కుటుంబ ఆనవాయితీని బట్టి సంతానం కలిగేవరకూ రాకపోకలు కుదరవని కొత్తరూలు చెప్పిన వాళ్ళతో 'మేం ఈ షరతుకి ఒప్పుకోమని' అమ్మానాన్నలు అభ్యంతరం చెప్పకుండా 'పిల్లనిచ్చుకున్న వాళ్ళం... గొప్ప వాళ్ళతో వియ్యమందాం.. వాళ్ళు చెప్పినట్లు వినాల్సిందే' అనుకోవటం తప్పు కదా...! సంబంధం కోరి వచ్చిన వాళ్ళు మన షరతులకి ఒప్పుకోవాలిగానీ, ఇలాంటి కొత్త పద్దతులు చెప్పటం ఏమిటో అనే ఆలోచనే రాకపోవటం విడ్డూరమే! అయితే మీ అబ్బాయినే మా ఇంట్లో వదిలి వెళ్ళండి... పిల్లో, పిల్లాడో పుట్టబోతున్న కబురు తెలిసాకనే కోడల్ని మీ ఇంటికి తీసుకువెళ్లండీ....' అని ఎదురు తిరిగితే బావుండేది కదా..? అందుకే మా వాళ్ళమీద నాకు చాలా కోపంగా ఉంది!

రోజులతో పాటు పద్దతుల్లో ఎన్నో మార్పులు వస్తాయి. మీ అత్తగారి అత్తగారు తన కొడుకు చనిపోయాక

ఎప్పటిదో సతీసహగమనం ఆచారాన్ని గుర్తుచేసుకుని పాటించమంటే.. ఎంత మూర్ఖంగా ఉంటుందీ...? ఎదురు తిరగాలనిపించదా? అలాగే కోడల్ని పుట్టింటికి వెళ్ళకూడదూ, వాళ్ళూ రాకూడదూ... అంటే.. మానసికంగా చంపేసినట్లే కదా.....? ఈ విషయం మా వాళ్ళకు మాత్రం అర్థం కాలేదు!

నావీ, మా వాళ్ళవీ అన్ని తప్పుల్నీ ఒప్పేసుకున్నాను. ఇది తప్పేం కాదు కదండీ!'' తలఎత్తి ఒకే ఒక్క నిముషం అత్తగారి వేపు సూటిగా చూసి.. ఆవిడ గొంతెత్తే అవకాశం ఇవ్వకుండా అక్కడ నుండి వచ్చేశాను!

నిలువు గుడ్లేసుకుని నిర్ఘాంతపోయిన ఆవిడ ముఖం చూస్తుంటే.. కొంచెం నవ్వు వచ్చింది గానీ తమాయించుకున్నాను.

గదిలో... మంచం మీద వాలగానే దుఃఖం ముంచుకువచ్చింది!

కన్నీళ్ళు చెక్కిళ్ళ మీదుగా ధారలుకట్టాయ్!

ఆయనగారు ఏమన్నాడూ.. నాకు మాటామంతీ చేతకాదట! నిజమేగానీ, నాది మాత్రమే తప్పు అవుతుందా? అతనికేం సంబంధం లేదా? మాటామంతీ బంతాట లాంటిదట!

ఒకరితో మాత్రమే వీలయ్యేది కాదు! ఇద్దరికీ ఆసక్తి ఉంటేనే ఆ బంతాట సజావుగా సాగుతుంది. ఆసక్తి, అనురక్తి ఉన్న భార్యాభర్తల మధ్య చతురోక్తులు పూల బంతుల్లా గెంతులు వేస్తూ ఉంటే ఆ బంతాట సరసంగా, రమ్యంగా ఉంటుంది!

ఆత్మీయుల మధ్య అయితే ఆహ్లాదంగా, కుటుంబ సభ్యుల మధ్య వాత్సల్య పూరితంగా జరుగుతుంది!

మరి... తప్పు నాదేనంటున్నారు! ఏమో..అందులోనూ నిజం ఉందా? అత్తగారి ఎత్తిపొడుపుల్ని ఎప్పటిలా విని వూరుకుంటే సరిపోయేది! అలా కాకుండా మాటల్ని పెంచి యుద్ధాన్ని తలపించేట్లు చేశానా..?

ఆ తరువాత నాలుగు రోజులు మామూలుగానే జరిగాయి.

నేను నా పనుల్ని యథాప్రకారం చక్కబెడుతుంటే, అత్తగారు మౌనంగా నావేపు తేరిపార చూడటమే తప్ప ఏమీ అనలేదు!

చిన్నచిన్న మాటలూ కరువయ్యాయి. ఆ చూపులకి భావం ఏమై ఉంటుందో..!

'దీనికేమైనా దెయ్యంగానీ పట్టిందా... లేకపోతే అంత ధైర్యం ఎలా వస్తుంది..?' ఇదే అయివుంటుందనేది నా ఊహ మాత్రమే!

గొడవ నా కారణంగానే అనుకొని నేనే మాట కలిపితే తప్పేముందీ..? ఆలోచిస్తే... పాపం మా అత్తగారికి రత్తాలుతో జరిగే మాటలు కూడా లేకుండా పోయాయి! నాగన్న తన పనేదో తను చేసుకుని వెళ్ళిపోతాడు.

ఇంటి పనులూ చేయలేదు...అలా ఒంటరిగా ఎంతసేపని కూర్చోవటం? నిజంగా కష్టమే! చదవడం నేర్చుకుంటే..పేపరో, పుస్తకాలో తిరగేస్తుంటే కొంత, ఇరుగుపొరుగు వచ్చిపోతుంటే మరి కొంత..కాలక్షేపం అవుతుంది.

అందుకే ఆరోజు...ఆవిడ కూర్చుని ఉన్నప్పుడు మంచినీళ్ళ గ్లాసు అందించి నేనూ కూర్చున్నాను.

''పెద్దవాళ్ళు నలుగురు మనింటికి వచ్చి...అందరూ కూర్చుని చక్కగా కబుర్లు చెప్పుకుంటూనే సరదాగా

చదువూ నేర్చుకోవటం ఎంత బావుంటుందో..! ఆసక్తి ఉన్నవాళ్ళనే రమ్మందాం! ముందుగా అక్షరాలు నేర్చేసుకుంటే, చిన్న చిన్న పదాలు చదవడం వచ్చేస్తుందా... ఆ తర్వాత మెల్లగా చందమామలాంటి కథల పుస్తకాలు, అలా అలా... అన్నీ చదివేయెచ్చు! పనులేవీ లేని తీరుబడి వేళల్లో.. మీకు తెలిసిన వాళ్ళని మనింటికి రమ్మని చెబుదామా...?'' ఉత్సాహంగా అడిగాను.

''అంటే...ఏమిటి..? నువ్వు బెత్తం పట్టుకొని కూర్చుని..పెద్దవాళ్ళ చేత.. ఈవయసులో పుస్తకాలు చేతబట్టించి చదువు చెబుతానంటావా..? ఇంటిని బడిగా చేసేయ్యటం... అంతా నీ పెత్తనమేనా..?'' రుసరుసలాడుతూ అక్కడనుండి విసురుగా వెళ్ళిపోతూ చీత్కారంగా నావేపు చూసిన చూపుకి నా తల సిగ్గుతో వంగిపోయింది!

★ ★ ★